క్లుప్తంగా

రూ.10లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో నూజివీడు రోడ్డు నుంచి శ్రీయోగీశ్వర్‌దేవీద యాళ్ మందిరం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ నిధులు పది లక్షల రూపాయలతో 196 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో ఈ రోడ్డు పనులు జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శివరామకృష్ణ తెలిపారు. ఆ ప్రాంత ప్రజలు, సాయిబాబాగు డికి వెళ్లే భక్తులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం పనులు ఇప్పుడు జరుగుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడి నడవడానికి వీలులేక పోవడం, వర్షం వస్తే బురదలోనే భక్తులు గుడికి వెళ్లే పరిస్థితి ఉండేది. ఈ రోడ్డు నిర్మాణం జరగడంతో రోడ్డు సమస్యకు మోక్షం లభించిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖాతాల్లో జమైన 'రైతు భరోసా'

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఐదో ఏడాది 3వ విడత వైఎస్సార్ రైతుభరోసా పీఎం కిసాన్ పథకంలో భాగంగా విజయవాడ రూరల్ మండలంలోని 4,669 మంది రైతులకు రూ. 95.11లక్షలను బుధవారం అందజేసిందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథబాబు తెలిపారు. అదే విధంగా వైఎస్సార్ సున్నావడ్డీ పంటరుణాలు 1,073 మంది రైతులకు గాను 25.19లక్షల రూపాయలను రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని వ్యవసాయాధికారి తెలిపారు.

ఉంగుటూరులో కౌలు రైతులకు రూ.74లక్షలు..

ఉంగుటూరు: మండలంలో రైతుభరోసా కింద 548 మంది కౌలురైతులకు రూ.73,98,000 నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని ఏవో హరీష్ కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రెండు వేలు చొప్పున 4,531మంది రైతుల బ్యాంకుల ఖాతాల్లో నిధుల జమయ్యాయని చెప్పారు. అదే విధంగా వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు 794మంది రైతులకు రూ.15,28,781 లబ్ధి చేకూరిందని వివరించారు.

'విద్యా దీవెన' లబ్ధిదారులు వీరే

పెనమలూరు: జగనన్న విద్యా దీవెన లబ్ధిదారుల పేర్లను బుధవారం ప్రకటించారు. పెనమలూరు మండల పరిధిలో విద్యా దీవెన 2024 మొదటి త్రైమాసికానికి అర్హులు, అనర్హుల జాబితాను మండల పరిధిలో అన్ని సచివాలయాలలో సోషల్ ఆడిట్ నిమిత్తం ప్రకటించామని గంగూరు వెల్ఫేర్ సెక్రటరీ ప్రేమ్‌సుధాకర్ తెలిపారు. మండల పరిధిలో మొత్తం 2,460 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన నిధులు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్చి 1వ తేదీన పామర్రులో సొమ్ము విడుదల చేస్తారని తెలిపారు.

'పింఛన్ కానుక' విడుదల

పెనమలూరు: వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద పింఛన్ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు మండల పరిపాలనాధికారి లోయ శివశంకర్‌రావు బుధవారం వివరాలు వెల్లడించారు. మండలంలో మొత్తం పింఛన్ దారులు 18,788 మంది ఉన్నారని వారికి ప్రభుత్వం రూ. 5.63 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. పెనమలూరు మండలం 5,823 మందికి రూ. 1.73 కోట్లు, తాడిగడప మునిసిపాలిటీలో 12,965 మందికి రూ. 3.90 కోట్లు నిధులు మంజూరు చేసి విడుదల చేశారన్నారు. ఆయా గ్రామాలలో వలంటీర్‌లు మార్చి 1వ తేదీ నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తారని తెలిపారు.

నేడు మినీ జాబ్‌మేళా

పెనమలూరు: పోరంకిలో మినీ జాబ్ మేళాను గురువారం నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటానికి ఉపాధ కల్పన శాఖ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పోరంకి శ్రీనివాస నగర్‌లోని హ్యాపీ మైండ్స్ ట్రెనింగ్ సెంటర్‌లో గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మేళా ఉంటుందన్నారు. పలు ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజవుతారన్నారు. ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకున్న వారు జాబ్‌మేళాకు రావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 12 వేల నుంచి రూ. 20 వేల వరకు వేతనం ఉంటుందని, వివరాలకు 9666615539లో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి పై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో భగత్‌సింగ్ నగర్‌కు చెందిన పెదపూడి మనోజ్‌కుమార్ కానూరులో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతను గ్రామంలో కొండ వెనుక ఉన్న నాయుడు టీ షాపు వద్దకు టీ తాగటానికి వెళ్లాడు. అక్కడ టీ కొట్టు యజమానితో ఇద్దరు వ్యక్తులు తగాదా పడుతుంటే వారిని మనోజ్ కుమార్ నివారించాడు. కాగా ఇంట్లో సరుకులు తీసుకురావటానికి మనోజ్‌కుమార్ రాత్రి కిరాణా షాపు వద్దకు రాగా శివపార్వతినగర్‌కు చెందిన ఎం.మహేష్, జి.కిశోర్, జయ, సాయిరామ్, సిద్దిక్ ఆటోలో వచ్చి మనోజ్‌కుమార్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో మనోజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. టీ షాపు వద్ద గొడవ నివారించినందుకే తనపై దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నాలుగు దశాబ్దాల సమస్యకు మోక్షం

- మురుగు అవస్థలకు చెక్
- ఎట్టకేలకు సిమెంటు రోడ్డు నిర్మాణం
- రెల్లి కాలనీ వాసుల్లో ఆనందం

ఇది కదా.. అభివృద్ధి

కంకిపాడు: అది పారిశుద్ధ్య కార్మికులు ఉండే ప్రాంతం. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా వారి ప్రాంతంలో అభివృద్ధి లేదు. కనీసం రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడ్డ పరిస్థితి. చిన్న పాటి వర్షానికే బురదకయ్యగా మారి ఇబ్బందులు పడ్డారు. ఒకటి కాదు.. రెండు కాదు.. నాలుగు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఈ సమస్యకు పరిష్కారం లభించటంలో రెల్లికాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రెల్లి కాలనీలో నిర్మితమైన సిమెంటు రోడ్డు

ఇదీ సంగతి..

మండల కేంద్రమైన కంకిపాడు పట్టణంలో 1984లో పారిశుద్ధ్య కార్మికులకు స్థలాలు కేటాయించటంతో ఈ ప్రాంతం రెల్లికాలనీగా ఏర్పడింది. వారంతా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి అప్పటి నుంచి అభివృద్ధికి దూరంగానే ఉంది. పంచాయతీ పాలకవర్గాలు మారినా, ప్రభుత్వాలు మారినా రోడ్డుకు మాత్రం మోక్షం దక్కలేదు. చిన్న వర్షం కురిసినా రోడ్డు మార్గం మొత్తం బురదమయంగా మారుతుంది. నడిచేందుకు సైతం అవస్థలు పడాల్సిన పరిస్థితి. స్థానికులు రోడ్డు అభివృద్ధి చేయాలని పదే పదే ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా సమస్యను పట్టించుకున్న వారే లేరు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పరిష్కారం..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మౌలిక వసతుల కల్పనకు ప్రధానంగా పాలకులు దృష్టి సారిస్తున్నారు. కంకిపాడు పంచాయతీ పాలకవర్గం రెల్లి కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మించేందుకు రూ. 4.50 లక్షలు నిధులు కేటాయించింది. ఈ నిధులతో సిమెంటు రోడ్డు పనులు చేపట్టి ఇటీవల పూర్తి చేశారు. నాలుగు దశాబ్దాల పాటు పడ్డ నడక అవస్థలకు తెరపడిందని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగాయి..



1984లో మాకు ఇక్కడ స్థలాలు ఇచ్చారు. అప్పటి నుంచి రోడ్డు కోసం విన్నవిస్తూనే ఉన్నాం. సంవత్సరాలు గడిచాయే కానీ రోడ్డు మాత్రం అభివృద్ధి జరగలేదు. సమస్య విని వెళ్లిపోయిన వారే కానీ పట్టించుకున్న వారు లేరు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాకు రోడ్డు వచ్చింది. ఇన్నాళ్లకు మా ఇబ్బందులు తొలగాయి.

– వడ్డాది శ్రీనివాసరావు, స్థానిక నివాసి

కష్టాలు తీరాయి..



వర్షం పడితే నడవలేక పోయే వాళ్లం. అంతా బురదే. రోజుల తరబడి నీళ్లు నిలిచిపోయి ఉండేవి. ఆ సమయంలో చాలా ఇబ్బంది పడే వాళ్లం. ఈ మధ్యనే సిమెంటు రోడ్డు వేశారు. రోడ్డు కష్టాలు తీరిపోయాయి. చాలా ఆనందంగా ఉంది.

– దలియా కామేశ్వరి, స్థానిక విద్యార్థిని

వసతుల కల్పనకు కృషి..



గ్రామంలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. అవరోధాలు ఉన్నా, ఆర్థికంగా భారం పడ్డా పట్టించుకోవటం లేదు. గ్రామం అంతటా అవసరమైన కనీస వసతులను కల్పించేందుకు, ఎన్నికల సమయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించేందుకు పాలకవర్గం కృషి చేస్తుంది.

– రాచూరి చిరంజీవి, జేసీఎస్ చైర్మన్, కంకిపాడు

ఘనంగా జాతీయ సైన్సు దినోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి



బహుమతులు అందజేస్తున్న వాకర్స్



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఖైజర్ బాషా



బాపులపాడులో విద్యార్థుల ప్రాజెక్టులు



విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ప్రతినిధులు

ఉయ్యూరు: జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఉయ్యూరు పబ్లిక్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి చెరుకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి హాజరై విజ్ఞాన ప్రదర్శనలను తిలకించి ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు పర్యవేక్షించారు. ఉయ్యూరు జెడ్పీ, ఆకునూరు ప్రభుత్వ, కాటూరు, కలవపాముల, ముదునూరు పాఠశాలలు, శ్రీ శ్రీనివాసా, రవీంద్రభారతి, లిటిల్ ఫ్లవర్ పాఠశాలల్లో సైన్స్ డే నిర్వహించారు.

వాకర్స్ ఆధ్వర్యంలో..

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైన్స్ విభాగంలో ప్రతిభ కనబరిచిన ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిప్పాడ చంద్రశేఖర్, దేవరపల్లి విక్టర్‌బాబు, వ్యాయామోపాధ్యాయులు ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కంకిపాడులో..

కంకిపాడు: జాతీయ సైన్స్ దినోత్సవం కంకిపాడు సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, లైవ్ వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ఎంఈఓ బీవీ శేషగిరిరావు ప్రదర్శనను తిలకించారు. ఆరోగ్యమాత ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కొచ్చిరాణి, పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ఎం. సాల్మన్‌రాజు, ప్రిన్సిపాల్ సిస్టర్ చిత్రా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టులు..

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బాపులపాడు ఎంఈవో-2 బి.సురేష్‌బాబు అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ విశేషంగా ఆకట్టుకుంది. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీ నారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శన..

రామవరప్పాడు: ప్రసాదంపాడులోని రవీంద్రభారతి పబ్లిక్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాలలోని 3, 4వ తరగతి విద్యార్థులు పలు రకాల నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రవీంద్ర భారతి విద్యా సంస్థల అధినేత వీరమాచినేని వంశీ కృష్ణ, ప్రిన్సిపాల్ ఊర్వశి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి

పెనమలూరు: అపార్టుమెంట్‌లో పని చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఈవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం రేపల్లె మండలం చౌడయ్యపాలెంకు చెందిన ఎస్.వెంకటేశ్వరరావు (60) కానూరులో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 26వ తేదీన వెంకటేశ్వరరావు అపార్టుమెంట్ కింద ఉన్న సమయంలో పిల్లర్లకు ఉన్న రేకు బాక్సులు ఊడతీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ రేకు బాక్స్ పై నుంచి జారి కింద ఉన్న వెంకటేశ్వరరావుపై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న అతను మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు



ఉయ్యూరు: ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు అన్నారు. పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలోని 9వ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో ప్రజలకు వైద్యులు డాక్టర్ గోపిచంద్, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. తొలుత శిబిరాన్ని వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్ రాజులపాటి చిన్నితో కలిసి వైస్ చైర్మన్ సురేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ సద్దాం, మునిసిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, నాయకులు అబ్దుల్ గఫూర్, బాషా పాల్గొన్నారు.

మునిసిపాలిటీ కార్మికులు ఐక్యంగా ఉండాలి

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీలో పని చేస్తున్న కార్మికులు ఐక్యంగా ఉండాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అన్నారు. యనమలకుదురు గ్రామంలో బుధవారం మునిసిపాలిటీ కార్మికుల ర్యాలీ అనంతరం సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. కార్మికులు హక్కులు సాధించుకోవాలంటే ఐక్య పోరాటం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కార్మికుల నూతన కమిటీ ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, నేతలు షేక్.కాశిం, నాగలక్ష్మి, ఏడుకొండలు, వెంకటరెడ్డి, మేరీ పలువురు పాల్గొన్నారు.

దర్జీలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

హనుమాన్‌జంక్షన్ రూరల్: దర్జీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం ప్రపంచ టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. శ్రీహనుమాన్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన కూడలిలో కుట్టుమిషన్ రూపకర్త విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, టైలర్స్ యూనియన్ జెండాను ఎగుర వేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన నక్కా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్జీలకు ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారని గుర్తు చేశారు. చేతివృత్తిదారులకు వడ్డీ లేని రుణాలను కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తూ ఆదుకుంటుందన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, టైలర్స్ అసోసియేషన్ నాయకులు ఎండీ అక్బర్ షరీఫ్, రెడ్డి నరసింహరావు, తాడి శ్రీనివాసరావు, కొమ్మూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం

గన్నవరం: స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ సమావేశ హాలులో బుధవారం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ సృష్టికర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి దర్జీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ టైలర్స్ అందరూ ఐకమత్యంగా ఉంటూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా కష్టాల్లో ఉన్న సభ్యులను ఆదుకునే విషయంలో అందరూ మానవత దృక్పథంతో ముందుకురావాలని సూచించారు. సంఘ నాయకులు బొర్రా మల్యాద్రి, యర్రం ఈశ్వరరావు, సాతులూరి శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో విలియం హోవే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టైలర్లు



హోవే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టైలర్లు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా వైద్య సాయం అందించేందుకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆరుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.7.45 లక్షల విలువ చేసే చెక్కులను బుధవారం నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు పంపిణీ చేశారు. కోడూరుపాడుకు చెందిన వెన్న భవానికి రూ. 3 లక్షలు, ఆళ్ల భాను శేఖర్‌కు రూ.1.50 లక్షలు, బాపులపాడుకు చెందిన చింతా మోనిషాకు రూ.1.10 లక్షలు, గార్లపాటి రాజేష్‌కు రూ.45 వేలు, మడిచర్లకు చెందిన సాయిల దేవదాసుకు రూ.70 వేలు, వీరవల్లికి చెందిన తలారి కృపారాణికి రూ.70 వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పీఏసీఎస్ చైర్మన్లు దయాల విజయనాయుడు, అల్లాడి థెరీసా, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడకల వీర్రాజు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా జగనన్న ప్రభుత్వం

మంత్రి జోగి రమేష్

పెనమలూరు: ముస్లిం మైనార్టీలకు అండగా జగనన్న ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ జోగి రమేష్ అన్నారు. కానూరు సనత్‌నగర్‌లో బుధవారం మైనార్టీ పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలకు భద్రత, సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. నేడు మైనార్టీలు ప్రభుత్వ సాకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కాగా మసీదు నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయించాలని ముస్లిం పెద్దలు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



మంత్రి జోగి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రామవరప్పాడు: గ్రామంలో నిర్వహించే అభివృద్ధి పనుల్లో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పంచాయతీ రాజ్ ఏఈ నందమూరి శివరామకృష్ణ కాంట్రాక్టర్‌కు సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరైన రూ. 15లక్షలతో రామవరప్పాడు రాజులబజార్‌లో ప్రారంభించిన అంతర్గత రహదారి అభివృద్ధి పనులను బుధవారం శివరామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి చేయాలన్నారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ పరిశీలనలో కాంట్రాక్టర్ కందిమళ్ల ఆంజనేయులు, వార్డు సభ్యుడు అద్దెపల్లి సాంబశివ నాగరాజు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ శివరామకృష్ణ

జగనన్నతోనే సంక్షేమ పథకాలు

పెనమలూరు: వచ్చే ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తాడిగడప మునిసిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. కానూరు మురళీనగర్‌లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగనన్నను సీఎం చేయటం వల్లే నేడు పేద, మధ్య తరగతి ప్రజలు, విద్యార్థులు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలతో ప్రమాదం పొంచి ఉందని, వారు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల నాయకుడు వేమూరి బాలకృష్ణ, తుమాటి శ్రీరాములు, ఎండీ బషీర్, కాకర్ల సుబ్బరాజు, కె.రమేష్, కాట్రగడ్డ శ్రీకాంత్ పలువురు పాల్గొన్నారు.



మురళీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి సాధించాలి

పెనమలూరు: విద్యార్థుల నైపుణ్యం పెంపొందించుకుంటే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించగలుగుతారని మైక్రోసాఫ్ట్ సీనియర్ డైరెక్టర్ మాధవి బొల్లేపల్లి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జాతీయ స్థాయిలో సాంకేతిక, సాంస్కృతిక పోటీలు ఎఫోసెక్-2024 జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ప్రపంచీకరణలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు వారిలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ హెచ్ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్ మాట్లాడుతూ సాంకేతిక పురోగతి అపూర్వమైందని అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ నుంచి బ్లాక్ చైన్ వరకు పునరుత్పాదక శక్తి నుంచి అంతరిక్ష అన్వేషణ వరకు అంతులేని అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ వికసిత్ భారత్ -2047 విజన్ థీమ్‌తో దేశ ఆర్థిక, సాంకేతిక, సామాజిక పురోగతికి సంబంధించి విద్యార్థులు వివిధ అంశాలలో నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా 1500 మంది విద్యార్థులు టెక్నిల్ ఈవెంట్‌లో పాల్గొని, వివిధ ప్రాజెక్టులు ప్రదర్శించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ మలినేని రాజయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేశ్వరరావు, డీన్ బి.పాండురంగారావు, పరిశోధన విభాగం డీన్ రాజు పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల వివరాలు తెలుసుకుంటున్న అతిథులు

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గన్నవరం రూరల్: మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో బుధవారం స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని, సీజనల్ హాస్టల్‌తో మరింత మేలు జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయం వద్ద వలంటీర్‌లను ఆయన సత్కరించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు దగ్గర చేయటంలో వలంటీర్ పాత్ర విశిష్టమైందన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం సమావేశం నిర్వహించారు. సర్వే ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిందని చెప్పారు. వీఆర్వో చందన శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనువణేష్, పలువురు వార్డు మెంబర్‌లు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సీఐగా పెద్దిరాజు బాధ్యతల స్వీకరణ



గన్నవరం: గన్నవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వాసా పెద్దిరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ట్రాఫిక్ సీఐ సూర్యనారాయణరావును మచిలీపట్నం డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీసీఆర్‌బీ సీఐ వాసా పెద్దిరాజును ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు ట్రాఫిక్ స్టేషన్‌లో పెద్దిరాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పెనమలూరు పీఎస్, సీఐడీ, డీసీఆర్‌బీ విభాగాల్లో సీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజును ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబు అన్నారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ యనమలకుదురులో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా గ్రామంలో అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అందరూ సహకరించాలని కోరారు.